సాక్షి శ్రీకాకుళం

శనివారం | 28 | సెప్టెంబర్ | 2024



ఆశ పడితే.. మోసపోతావ్

వివరాలు చూసుకోకుండా ఆశ పడితే మోసం చేస్తున్నారు. ఉద్యోగాలు, విదేశీ చదువుల వల వేస్తున్నారు.

- 8లో



జిల్లా అటవీశాఖాధికారిగా సంజయ్

అరసవల్లి: డీఎఫ్‌ఓగా యాళ్ల సంజయ్ నియమితులై శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా పనిచేసిన వెంకటేష్ విజయనగరం డీఎఫ్‌ఓగా కొనసాగుతున్నారు.

రెవెన్యూలో మూడు కేడర్లలో బదిలీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీలు ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. శుక్రవారం ఉదయం టైపిస్టులకు-4, జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్-5, జూనియర్ అసిస్టెంట్లు-22 మందికి బదిలీల ఉత్తర్వులు విడుదల చేశారు. ఇంకా వీఆర్‌ఓ, సీనియర్ అసిస్టెంట్స్, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లకు బదిలీలు చేయాల్సి ఉంది. కానీ ఇవి జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

మండల కేంద్రాల్లో పూజలు చేద్దాం: ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: చంద్రబాబు పాపాల్ని ప్రక్షాళన చేసేందుకు అన్ని మండల కేంద్రాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలాల్లో పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు ఇతర ప్రధాన నాయకులు అందరూ సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ప్రెస్ మీట్లు పెట్టి చంద్రబాబు వంద రోజుల్లో చేసిన దారుణాలు, తిరుమలను ఏ విధంగా అపవిత్రం చేశారో వివరించాలని కోరారు. చంద్రబాబు వంద రోజుల్లో చేసిన పాపాలు ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

స్కూల్‌గేమ్స్ హాకీ ఎంపికల నిర్వహణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కూల్‌గేమ్స్ ఎంపికల్లో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో హాకీ ఎంపికలు జరిగాయి. అండర్-14, 17, 19 బాల బాలికలకు వేర్వేరుగా ఎంపికలను నిర్వహించారు. శ్రీకాకుళంలో కురిసిన వర్షాలతో మైదానం చిత్తడిగా మారడంతో క్రీడాకారులు ఒకింత ఇబ్బందికి గురి కాగా.. సాఫ్ట్‌బాల్ ఎంపికలను వాయిదా వేశారు. సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించాలని నిర్ణయించినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శితోపాటు జిల్లా పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

వంశధార ప్రాజెక్టు పనుల పరిశీలన



వంశధార రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న సీఈ సుగుణాకర రావు

హిరమండలం: వంశధార రిజర్వాయర్ (జలాశయం)పనులతో పాటు ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకర్ అన్నారు. వంశధార జలాశయాన్ని నింపేందుకు నిర్మిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో పనుల ప్రగతిపై సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, డీఈలు రవికాంత్, సురేష్, డీఎస్‌సీ స్వర్ణకుమారి, జేఈలు దిలీప్, భరత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గాంధీయాన్ సోషల్ వర్క్ పీజీ డిప్లమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభిస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ గాంధీయాన్ సోషల్ వర్క్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ విద్యార్హత కాగా, వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని రూ. 200 ఫీజుతో దరఖాస్తులు అక్టోబర్ 5వ తేదీ లోపు చేసుకోవాలని అన్నారు. రూ. 2500 ట్యూషన్ ఫీజుగా చెప్పారు. ఈ కోర్సును స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణ అభివృద్ధి సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9494520417, 6304520208ను సంప్రదించాలని అన్నారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఆర్‌బీఆర్‌ఏయూ.ఈడీయు.ఐఎన్‌లో పొందు పర్చినట్లు చెప్పారు.

విదేశీ పక్షుల సంరక్షణపై మరింత శ్రద్ధ

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచికి వస్తున్న విదేశీ పక్షుల సంరక్షణపై మరింత శ్రద్ధ తీసుకుని వాటిని కాపాడాలని జిల్లా అటవీ శాఖ నూతన అధికారి యాళ్ల సంజయ్ అన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన గురువారం ఆయన తేలుకుంచిని సందర్శించారు. సైబీరియా నుంచి వస్తున్న విదేశీ పక్షుల ఆహారం సేకరణ, గుడ్లు పెట్టే విధానంపై సిబ్బంది, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ బిల్ స్టార్క్స్‌గా పిలిచే ఈ పక్షులు ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. పక్షుల సంరక్షణ కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు.




● మబ్బు చుట్టాలు

నిండుగా నవ్వుతున్న నాగావళిని పలకరించడానికి మబ్బు చుట్టాలు వచ్చాయి. వస్తూ వస్తూనే నగరాన్నంతా చుట్టుముట్టాయి. కుశలమేనా.. అని అడిగినట్టు నాలుగు చినుకులు చిలకరించి ఆహ్లాదాన్ని పంచుతూ కదిలి వెళ్లిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఇసుక దోపిడీలే కాదు.. దాడులు కూడానా..



- అక్రమాలు అడ్డుకుంటున్న వ్యక్తిపై దాడి
- ఆమదాలవలస ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన సనపల సురేష్ కుమార్‌పై దౌర్జన్యం
- కూన రవికుమార్ అనుచరులే దాడి చేశారన్న బాధితుడు సురేష్



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సురేష్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఇసుక అక్రమార్కులు బరి తెగించారు. ఇసుక దోపిడీకి అడ్డంకిగా ఉన్న వ్యక్తులపై దాడులకు దిగుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో తాజాగా ఇసుక అక్రమాలపై తరచూ ఫిర్యాదు చేయడమే కాకుండా అక్రమాలను నేరుగా అడ్డుకుంటున్న సనపల సురేష్ కుమార్ అనే వ్యక్తిపై దాడికి దిగారు. టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులు, మరికొంతమంది తనపై దాడి చేశారని బాధితుడు నేరుగా ఆరోపించారు. వీరితో తన ప్రాణానికి ప్రమాదం ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. తనపై జరిగిన దాడిని వివరిస్తూ ఒక వీడియోను రికార్డు చేసి వివిధ వాట్సాప్ గ్రూపుల్లో విడుదల చేశారు. గాయపడిన సురేష్ శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు. ఈ తరహా దాడులు టీడీపీ హయాంలో కొత్తేమీ కాదు. 2014-19లో కూడా ఆమదాలవలస నియోజకవర్గంలో ఇదే రకంగా దాడులకు తెగబడ్డారు. మళ్లీ ఇప్పుడదే భయానక వాతావరణం సృష్టిస్తున్నారు.

డీసిల్టేషన్ పాయింట్‌లో భారీ దోపిడీ

బూర్జ మండలం కాఖండ్యాంలో నాగావళి నదిలో డీసిల్టేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నదిలో వరదలతో ఏర్పడి మేటలను తొలగించి, ఆ ఇసుకను వినియోగదారుల అవసరాలకు విక్రయించాలన్నది డీసిల్టేషన్ ఉద్దేశం. తొలగించిన ఇసుకను ఒక చోట డంప్ చేసి, అక్కడి నుంచి విక్రయించాలి. స్టాక్ పాయింట్ నుంచే లారీలకు లోడింగ్ చేసి పంపించాలి. కానీ, అందుకు భిన్నంగా జరుగుతోంది. డీసిల్టేషన్ పేరుతో నదిలో జేసీబీల ద్వారా ఇసుక తవ్వకాలను చేస్తున్నారు. తవ్విన ఇసుకను నదిలోనే లారీల్లో లోడింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధమే. ఇదంతా ఒక ఎత్తు అయితే టన్నుకి రూ. 340చొప్పున ప్రభుత్వం ధర పెట్టగా, అక్కడ పెత్తనం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు లారీకి అదనంగా రూ. 12వేల నుంచి రూ. 15వేలు వసూలు చేస్తున్నారు. రూ. 10వేలు కీలక ప్రజాప్రతినిధికని, మిగతా సొమ్ము నదిలో బాట ఖర్చులకని వసూలు చేస్తున్నారు. ఇదంతా పబ్లిక్‌గానే జరుగుతోంది. ఇక్కడ జరుగుతున్న దందా అధికారులకు తెలిసినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఆ నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధికి భయపడి అధికారులూ రావడం లేదు. కొందరు నాయకులు మాఫియాగా తయారై కాఖండ్యాం పాయింట్‌ను అక్రమాలకు అడ్డాగా చేసుకున్నారు. దీనిపై ఇప్పటికే 'సాక్షి'లో పతాక శీర్షికలతో ప్రత్యేక కథనాలు వచ్చాయి. మీడియాలో వచ్చాక హడావుడి చేయడం, ఆ తర్వాత యథావిధిగా వదిలేయడం చేస్తున్నారు. ఇక్కడ రోజుకి రూ.లక్షల్లో అక్రమ వ్యాపారం జరుగుతోంది.

అక్రమాలకు అడ్డుగా సనపల సురేష్

బూర్జ మండలం కాఖండ్యాం, చినంకలాం, నారాయణపురం వద్ద జరుగుతున్న ఇసుక అక్రమాలను సనపల సురేష్ అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ర్యాంపుల్లోకి యంత్రాలతో చేస్తున్న తవ్వకాలను నిలదీస్తున్నారు. ఈయన మొన్నటి ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. జరుగుతున్న అక్రమాలను ఎప్పటికప్పుడు బయటపెట్టడమే కాకుండా కలెక్టర్, ఎస్పీకి తరుచూ ఫిర్యాదు చేస్తున్నారు. తమకు తరుచూ అడ్డు తగులుతున్న సురేష్‌ను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు సార్లు ఆయనను బెదిరించారు. అయినా సురేష్ వెనక్కి తగ్గలేదు. దీంతో శుక్రవారం సురేష్‌పై కొంతమంది దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. నారాయణపురం వద్ద కా రులో ఉన్న ఆయన్ని ఇసుక మూకలు బయటికి లాగి, చొక్కా చించేసి, గుండెలపై పిడుగుద్దులు గుద్ది, గొంతు మీద గుద్దేసి భయానకంగా ప్రవర్తించారు. ఘటనలో సురేష్‌కు గాయాలయ్యాయి. తనపై జరిగిన దాడిని కళ్లకు కట్టినట్టు వీడియో చేసి మీడియాకు విడుదల చేశారు. తనకు ప్రాణ హాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని, గతంలో కూడా ఎస్పీకి ఫిర్యాదు చేశానని, ఇసుక అక్రమార్కులు తనను ఏమైనా చేయవచ్చని ఫిర్యాదులో తెలియజేశానని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

రవికుమార్ అనుచరులే..

కూన రవికుమార్ అనుచరులు, రీచ్‌లో పనిచేస్తున్న, రీచ్‌ను నడిపిస్తున్న బూర్జ మండలం నీలంపేట గ్రామానికి చెందిన కోడి గోవిందరావు, కోడి రమేష్, కోడి సురేష్, కోనంపేటకు చెరుకు బాలకృష్ణ, చిన లంకాంకు చెందిన కొండ విష్ణు, మరో నలుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని సురేష్ ఆరోపించారు. నారాయణపురం గ్రామస్తులు వచ్చి విడిపించడంతో ప్రాణాలతో బయటపడ్డానని చెప్పుకొచ్చారు. ఇసుక అక్రమాలపై ఫైట్ చేస్తున్నానని, కూన రవికుమార్ పనులను అడ్డుకుంటున్నాననే కోపంతోనే దాడి చేశారని వీడియో రిలీజ్ చేశారు. తనపై దాడి చేయడమే కాకుండా భార్య పిల్లలను దూషించారని, రూ. 50వేల నగదు, రెండున్నర తులాల బంగారం గొలుసును కూడా లాక్కున్నారని చెప్పారు. గాయాలతో సురేష్ రిమ్స్‌లో చేరి చికిత్స తీసుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణగా కేసు నమోదు

తనపై దాడి జరిగిందని, తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని సనపల సురేష్ వీడియో ద్వారా బయట ప్రపంచానికి తెలియజేశాక, రిమ్స్‌లో చేరాక పోలీసులు తప్పని పరిస్థితుల్లో రంగంలోకి దిగారు. ఇరువర్గాల గొడవగా తేల్చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేస్తున్నట్టు ఆలస్యంగా సెలవిచ్చారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 8గంటల వరకు ఏమీ జరగలేదని చెప్పిన పోలీసులు విషయం పెద్దది అయ్యాక రెండు వర్గాల గొడవగా వెల్లడించారు. రిమ్స్‌లోని అవుట్ పోస్టు వారు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. సహజంగా పోలీసులు స్పందించే తీరు ఇలాగే ఉంటుందనేది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

మాకు దరఖాస్తు చేస్తేనే.. మీకు సూపర్ సిక్స్

వజ్రపుకొత్తూరు: మాకు దరఖాస్తు చేస్తేనే మీకు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు.. అంటూ బెండి పంచాయతీలోని మహదేవిపురం, బట్టుపాడులో కూటమి నేతలు ఇంటింటికీ దరఖాస్తులు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం అందించే పింఛన్, ఏ ఇతర పథకమైనా సచివాలయం లేదా సంబంధిత అధికారికి దరఖాస్తు చేయడమనేదే ఇప్పటి వరకు చూశాం. కానీ అందుకు భిన్నంగా తామిచ్చిన దరఖాస్తుతో వస్తేనే మీకు పథకాలు అంటూ బెండి పంచాయతీలో కూటమి నేతలు విచిత్ర సంప్రదాయానికి తెర తీశారు. దాదాపు 30 మంది వరకు వీటిని పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు, ప్రజలు, విచిత్రంగా చూస్తున్నారు.



బెండి పంచాయతీలో కూటమి నేతలు పంపిణీ చేసిన దరఖాస్తు

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సదాశివుని తిరుమల చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బోధన, సిబ్బంది పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. వీటిలో బోధన సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపాదికన(కాంట్రాక్టు), బోధనేతర సిబ్బందిని పొరుగుసేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపాదికన 2024-25 విద్యా సంవత్సరం (ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు.

మొత్తం 38 పోస్టులు భర్తీ..

జిల్లాలో ఖాళీగా ఉన్న 38 పోస్టుల భర్తీకి అధికారులు నిర్ణయించినట్టు తిరుమల చైతన్య చెప్పారు. పీజీటీ పోస్టులు 03, సీఆర్టీలు 13, వార్డెన్‌లు 03, పార్ట్ టైం టీచర్లు 16, అకౌంటెంట్ పోస్టులు 03 భర్తీ చేయనున్నట్టు చెప్పారు. అభ్యర్థులు అక్టోబర్ 10వ తేదీ రాత్రి 11.59 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తమ దరఖాస్తులను ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో రూ.250 దరఖాస్తు ఫీజుగా చెల్లించి, అప్లై చేసుకోవాలన్నారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 18-42 ఏళ్లు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 5, మాజీ సైనికోద్యోగినులకు 3, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉందన్నారు.


బోర్డు తిప్పేశారు..!



శ్రీకాకుళం: జిల్లాలో మరో మోసం జరిగింది. అధిక డబ్బులు ఆశ చూపిన 'అంతర్జాతీయ సంస్థ' ఉన్నట్టుండి బోర్డు తిప్పేయడంతో జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాలకు చెందిన 957 మంది మోసపోయారు. వీరిలో అత్యధికులు విద్యాధికులే కావడం విశేషం. ఇటీవలే రెండు సంస్థలు బోర్డు తిప్పేసిన విషయం మరువక ముందే తాజాగా 'ఆంటోఫాగస్టా' అనే సంస్థ బోర్డు తిప్పేసి సుమారు రూ.3కోట్లు వరకు ఖాతాదారులను ముంచేసినట్లు సమాచారం. చిలీ దేశానికి చెందిన బహుళ జాతి సంస్థగా చెప్పుకుంటున్న ఆంటోఫాగస్టు సంస్థలో పెట్టుబడి పెడితే ఆ డబ్బుని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మైనింగ్, రైల్వే వంటి సంస్థల్లో పెట్టుబడులు పెట్టి లాభాలను పెట్టుబడిదారులకు పెద్దమొత్తంలో చెల్లిస్తామని ఆశ చూపింది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఈ సంస్థ నమోదైయినట్లు ఆధారాలను చూపించింది. దీంతో పలువురు ఖాతాదారులు పెట్టుబడులు పెట్టగా రెండు రోజుల నుంచి సంస్థ ప్రతినిధుల నుంచి సమాధానం లేకుండా పోయింది. 15 రోజులుగా చెల్లింపులు లేకపోవటంతో అనుమానం వచ్చిన పలువురు ఖాతాదారులు పూర్తి స్థాయిలో వివరాలు తెలుసుకుని మోసపోయామని గుర్తించారు. మోసపోయిన వారిలో విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. చెన్నై చిరునామాతో కార్యాలయం ఉండగా అందులో ఇచ్చిన ఫోన్ నంబర్లు ఐదు రోజుల కిందటి నుంచి పని చేయటం లేదని ఖాతాదారులు చెబుతున్నారు. అంతకు ముందు కూడా ఫోన్లకు స్పందించకుండా కేవలం వాట్సాప్ ద్వారానే సమాచారాన్ని చేరవేస్తూ స్పందించేవారు. 15 రోజులుగా వారి నుంచి స్పందన లేకపోవటంతో వాట్సాప్ నంబర్లను పరిశీలించగా అవన్నీ ఇంతర దేశాలకు చెందినవిగా గుర్తించారు. లబోదిబోమంటూ వారంతా పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

బడుగుల బతుకుల్లో రాజకీయ చిచ్చు





ఒకటో తేదీన ఖాళీ బ్యాంకు ఖాతా ఇంటిల్లిపాదినీ వెక్కిరిస్తే..? పాత క్యాలెండర్ పేజీలో రాసిన లెక్కల చిట్టాలు భయపెడితే..? ప్రతి నెలా వచ్చే జీతం ఇకపై రాదని తెలిస్తే..? ఒకరి సంపాదనపైనే ఆధారపడిన కుటుంబానికి ఆ ఒక్క ఆధారాన్ని దూరం చేస్తే..? ఎంత భయానకమో కదా.. ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన సిబ్బంది పరిస్థితి ఇలాగే ఉంది. మేము అధికారంలోకి వస్తే లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన వారు.. ఇప్పుడు ఈ చిరుద్యోగులను నిరుద్యోగులను చేస్తూ పొట్ట కొడుతున్నారు.

- జిల్లాలో రోడ్డున పడనున్న 1065 కుటుంబాలు
- నూతన మద్యం పాలసీతో ఉద్యోగాలు కోల్పోనున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్లు, నైట్‌వాచ్‌మెన్లు
- వంద రోజుల్లో మా కడుపు కొట్టారంటూ ఆవేదన

నరసన్నపేట:

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజుల్లో జిల్లాలో 1065 కుటుంబాలను రోడ్డున పడేసేందుకు రంగం సిద్ధం చేసింది. గత ప్రభుత్వం మద్యం పాలసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. డిగ్రీ, ఇంటర్ చదివిన వారికి అన్ని అర్హతలు చూసి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉద్యోగాలు కల్పించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న మద్యం పాలసీ వారి ఉద్యోగాలను అడకత్తెరలో పెట్టింది. ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు మద్యం షాపులు నడపాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దీనికి సన్నాహకాలు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, నైట్ వాచ్‌మెన్లు కొలువులు కోల్పోయే పరిస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన వంద రోజుల్లో మా బతుకులు బజారుకు ఈడ్చిందని వీరు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 1065 మంది ఉద్యోగులు..

జిల్లాలో 193 ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. వీటిల్లో 193 మంది సూపర్‌వైజర్లు, 560 మంది సేల్స్‌మెన్లు, 312 మంది నైట్ వాచ్‌మెన్లు పని చేస్తున్నారు. వీరి నియామకాలు నోటిఫికేషన్ ద్వారా చేపట్టారు. జాయింట్ కలెక్టర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సూపర్‌వైజర్లకు బీకాం డిగ్రీ, సేల్స్‌మెన్లకు ఇంటర్ క్వాలిఫికేషన్‌తో ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో వీరంతా రోడ్డున పడనున్నారు. నిరుద్యోగులకు ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు ఈ విధంగా ఉన్న ఉద్యోగాలు తొలగించడాన్ని వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మమ్మల్ని రోడ్డున పడేయకండి అని వేడుకుంటున్నారు.

ప్రత్యామ్నాయంపై స్పష్టత కరువు

నూతన మద్యం పాలసీలో దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. ఈ నేపథ్యంలో వేలంలో దుకాణాలను దక్కించుకున్న వారు పాత సిబ్బందిని అదే వేతనంతో కొనసాగించే సూచనలు కనిపించడం లేదు. మా మనుషులను మేం వేసుకుంటాం.. మీకు అవకాశం ఇవ్వం అని ఇప్పటి నుంచే అంటున్నారు. సంఘం తరఫున నాయకులు కమిషనర్‌ను కలిసినా ఆశించిన విధంగా హామీలు రావడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ చర్యలపై సిబ్బంది ఆశలు వదిలేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు ఆదుకోవాలని కోరుతున్నారు.



ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రీకాకుళంలో డిమాండ్ చేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది (ఫైల్)

మా కుటుంబాలను వీధిన పడేయకండి



కాంట్రాక్టు పద్ధతిలో అయినా ప్రభుత్వ కొలువు వచ్చిందని సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చి మా ఆశలను నీరు గార్చుతోంది. మా కుటుంబాలను వీధిన పడేయకండి. పెద్ద మనసుతో ఆలోచించి మాపై కరుణ చూపి మమ్మల్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

– కీర్తి ధర్మారావు, ఏపీ స్టేట్ బ్రూవరీస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఇన్నాళ్లూ ఎంతో బాధ్యతగా పనిచేశాం. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేశాం. కూటమి ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి. ప్రభుత్వ పాలసీలు మారినంత మాత్రాన మమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నాలు చేయడం శోచనీయం.

– జి.శ్రీను, రాష్ట్ర యూనియన్ సభ్యుడు, శ్రీకాకుళం

క్లుప్తంగా

అనుమతులు లేకుంటే చర్యలు తప్పవు



వసతి గృహ బాలలతో అధికారులు

హిరమండలం: అనుమతులు లేకుండా బాలల వసతి గృహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల సంక్షేమ సమితి బృందం బాలల రక్షణ అధికారులు కేవీ రమణ, ఎం.మల్లేశ్వరరావు హెచ్చరించారు. హిరమండలం హిల్‌కాలనీ గ్రేస్ చర్చ్‌లో నిర్వహిస్తున్న బాలల వసతి గృహాన్ని కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం జిల్లా బాలల సంక్షేమ సమితి బృందం తనిఖీ చేసింది. బాలల వసతి గృహానికి ఎలాంటి అనుమతులు లేవని, ఇలా అనుమతులు లేని వసతి గృహాలు నిర్వహించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వసతి గృహంలో 21 మంది బాలలు ఉన్నట్లు గుర్తించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను జిల్లాలోని వివిధ ప్రభుత్వ అనుమతులు పొందిన బాలల వసతి గృహాల్లో చేర్పిస్తామన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు బాలబాలికలతో వసతి గృహాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలల రక్షణ అధికారులు ఐఎల్ నాయుడు, టి.లక్ష్మణరావు బాలల సంక్షేమ సమితి సభ్యులు వి.రమణమూర్తి, ఎం.గున్నప్పడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావాణి, మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రసన్న, చైల్డ్ హెల్ప్‌లైన్ నవీన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి కుటుంబానికి పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, డీఈఓ తిరుమల చైతన్య

రణస్థలం: పాతర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25న నిర్మాణ దశలో ఉన్న భవనం సన్‌స్లేడ్ కూలి వనం కృష్ణంరాజు అనే పదో తరగతి విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. పాతర్లపల్లి గ్రామంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వ ప్రకటించిన రూ. 5 లక్షల పరిహారాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎస్.ఈశ్వరరావు, డీఈఓ తిరుమల చైతన్యల చేతుల మీదుగా అందజేశారు. తహసీల్దార్ ఎస్.ప్రసాద్, కూటమి నాయకులు ఉన్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వ్యసన విముక్త శ్రీకాకుళం కోసం, రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్ఎస్‌పీ ఫౌండేషన్, యునైటెడ్ ఎన్‌జీఓల ఆధ్వర్యంలో అక్టోబర్ ఒకటో తేదీన నిర్వహించనున్న వరల్డ్ మెంటల్ హెల్త్ డే వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఒకటో తేదీన నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓస్ ఫోరమ్ ప్రతినిధులు పొన్నాడ రాజశేఖర్, మనిశర్మ, డాక్టర్ టి.మణికంఠ, దూసి సంతోష్, ఎస్.జోగినాయుడు, నర్మజా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బావాజీపేటకు చెందిన లండ అప్పన్న రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందారు. రూరల్ ఎస్ఐ కిశోర్‌వర్మ ఇచ్చిన వివరాలు మేరకు.. బావాజీపేటకు చెందిన అప్పన్న, లచ్చమ్మ భార్యాభర్తలు. వీరిద్దరూ కలిసి ద్విచక్ర వాహనం మీదుగా రాయిపాడు గ్రామంలో ఇటీవలే వివాహం జరిగిన తమ కూతురిని చూసేందుకు బయల్దేరారు. రాగోలు జంక్షన్ వద్దకు రాగానే గతుకుల రోడ్డులో బండి స్లిప్ కావడంతో గోతిలో పడి అక్కడికక్కడే అప్పన్న చనిపోయారు. భార్య లచ్చమ్మకు చిన్నచిన్న గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ పడితే.. మోసపోతావ్..!

- ఫేక్ ఉద్యోగాల వలలో యువత
- విదేశీల్లో ఉన్నత చదువుల పేరిట మోసం
- రూ.లక్షలు ముట్టజెప్పి నట్టేట మునిగిపోతున్న వైనం



శ్రీకాకుళం క్రైమ్ :

ప్రభుత్వ ఉద్యోగం, విదేశాల్లో చదువు.. చాలా మంది సామాన్యుల జీవితాశయాలు ఇవి. ఈ ఆశను ఆసరాగా చేసుకుని కొందరు మోసం చేస్తున్నారు. అమాయకత్వాన్ని అదనుగా తీసుకుని రూ.లక్షలు తీసుకుని నట్టేట ముంచేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో బాధితులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో వారంలో ఒకరోజు నిర్వహించే కలెక్టర్, ఎస్పీ గ్రీవెన్స్‌లలో ఇలాంటి ఒక్క ఫిర్యాదైనా నమోదవుతుండటం విశేషం. ఇటీవలే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఫేక్ ఉద్యోగాల ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఇలాంటివి జిల్లావ్యాప్తంగా ఎన్నో జరుగుతున్నాయి.

మోసాల్లో కొన్ని..

- అరసవల్లికి చెందిన గొల్ల బెనర్జీ బ్యాంకు ఉద్యోగాలిప్పిస్తానని చెప్పడంతో జిల్లా కేంద్ర సమీప ప్రాంతాల నిరుద్యోగ యువత రూ.1.80 కోట్లు ఇచ్చి మోసపోయారు. గత నెల 12న ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.
- కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ సీట్లు అని నమ్మించి ఆరేళ్ల ఫీజు ముందుగానే వసూలు చేసి పూర్తిగా చెల్లించకుండా రూ. 2 కోట్లు మోసం చేశాడంటూ జిల్లాకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్పీని ఆశ్రయించారు.
- లోహరిబంధకు చెందిన పంచాయతీ కార్యదర్శి మన్నెం సతీష్ బాబు జిల్లాలో పలువురిని ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి నమ్మించి రూ. కోట్లలో కొట్టేశాడని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఈ ఏడాది జూలై 22న గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఇతనిపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు ఉన్నాయి.
- నందిగాంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ కానిస్టేబుల్ నిరుద్యోగులకు కోర్టులో జాబ్‌లిప్పిస్తానని నమ్మబలికి రూ. 24 లక్షలకు టోకరా వేశాడు.
- 104లో జిల్లా మేనేజర్ పోస్టు ఇప్పిస్తానని ఇద్దరి నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కొయ్యు మణిస్వరూప్ రూ. 6.10 లక్షలకు మోసం చేశాడు.
- విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి గార మండలానికి చెందిన ఓ వ్యక్తి నిరుద్యోగుల నుంచి చాలా మొత్తంలో డబ్బులు కొట్టేయడంతో రాష్ట్రం నలుమూల నుంచి నిరుద్యోగులు వచ్చి గారలో గత ఏడాది ఆగస్టు 12న కేసు పెట్టారు.

ఏం చేయాలి..?

ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తారని, పారదర్శకంగా ఎంపిక చేస్తారని అవగాహన పెంచుకోవాలి.

- ప్రస్తుత రోజుల్లో ప్రతి ఉద్యోగ ఎంపిక పారదర్శకంగా, ఆన్‌లైన్ పద్ధతిలో జరుగుతోంది. ఎట్టి పరిస్థితుల్లో రిఫరెన్స్‌లు చేస్తామన్నవారిని నమ్మరాదు.
- బ్యాంకుల్లోను, ఇతర ప్రభుత్వ సంస్థల్లో జాబ్‌లంటూ వచ్చే ఫేక్ ప్రకటనలు, ఆన్‌లైన్ ప్రకటనలు నమ్మకూడదు. సంబంధిత కార్యాలయాలను సంప్రదిస్తే మంచిది. ప్రతి ఉద్యోగానికి గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేస్తారన్నది మర్చిపోరాదు.

మోసాలను అరికడతాం

ప్రస్తుతం మోసాలు అధికంగా జరుగుతున్న కారణంగా ఏపీ ప్రభుత్వం పీడాట్ (ప్రీడిపార్చర్) సెంటర్లను శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయవాడ, చిత్తూరు, కాకినాడ, కడపలో ప్రారంభించింది. విదేశాలకు వెళ్లేవారికి జేఈఓలతో శిక్షణనిప్పించి వీసా ఇస్తాం. మన ఏపీలో హై మైగ్రేషన్ ఉన్న ప్రాంతాలైన గోదావరి జిల్లాలకు వెళ్లి గల్ఫ్ దేశాలకు వెళ్లేవారితో మోటివేట్ చేసే ప్రణాళిక ఉంది. శ్రీకాకుళం కూడా వస్తాం.

– బీఆర్ క్రాంతికుమారి, ఓంకాప్ జీఎం, విజయవాడ

ఇల్లీగల్ ఏజెన్సీల ద్వారా వెళ్లకూడదు..



విదేశాలకు వెళ్లేవారు ఇల్లీగల్(లైసెన్సు లేని) ఏజెన్సీలు, కన్సల్టెన్సీల ద్వారా వెళ్లరాదు. ఒక వేళ ప్రైవేటు ఏజెన్సీల ద్వారా వెళ్లినా అవి లైసెన్స్ కలిగి ఉన్నాయా లేదా అన్నది గమనించాలి. స్వదేశంలో ఉండే కన్సల్టెన్సీలు, ఏజెంట్లు, విదేశీ సంస్థల బ్యాగ్రౌండ్ విచారించి తెలుసుకోవాలి. జిల్లాలో ఉన్న ఉపాధి కల్పనా కేంద్రాన్ని, మరీ ముఖ్యమైతే జిల్లా కలెక్టరేట్‌ను సంప్రదిస్తే మంచిది.

– కె.సుధ, జిల్లా ఉపాధి కల్పన అధికారి, శ్రీకాకుళం

అప్రమత్తంగా ఉండాలి..



నిరుద్యోగ యువత, విద్యార్థులు మోసపూరిత ప్రకటనలపై ఉండాలి. ఇలాంటి మోసాలపై ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసి పరిష్కారానికి కృషిచేస్తున్నాం.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

విదేశాలకు వెళ్లాలనుకుంటే..

కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ ద్వారా రిజిస్టర్ అయిన రిక్రూటింగ్ ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా వెళ్తే మంచిది. మన దేశంలో పదివరకు కేంద్రాలుండగా మన ఏపీలో ఓవర్సీస్ మేన్ పవర్ క్యాంప్ ఆఫీస్ ఆఫ్ ఏపీ (ఓఎంసీఏపీ– ఓంకాప్) విజయవాడలో ఉంది. అలాగే తెలంగాణలో టీఎంసీఏపీ ఉంది. ఇక్కడ ఈ–మైగ్రేట్ రిజిస్టర్‌లో ఫారిన్ ఎంప్లాయిస్ పేర్లు, కన్సల్టెన్సీ ఏజెంట్ల పేర్లు, సంస్థలు అన్నీ పొందుపరిచి ఉంటాయి. ఒకవేళ ప్రైవేటు ఏజెన్సీల ద్వారా వెళ్లినా అవి ప్రభుత్వంతో గుర్తింపు పొంది, లైసెన్సు కలిగేవి అయి ఉండాలి. అయినప్పటికీ ఎమిగ్రేషన్ క్లియరెన్సు (వీసా)కు సంప్రదించాల్సింది ఓంకాప్‌నే.

● దండెపై కొండ చిలువ



అర్ధరాత్రి రెండు గంటలు. ఇంటిల్లిపాదీ ఆదమరిచి నిద్రపోతున్న వేళ. నట్టింటిలో బట్టల దండెపై చప్పుడైంది. ఏంటా అని లైటు వేసి చూస్తే పది అడుగుల కొండచిలువ దండెపై నుంచి గోడపైకి పాకుతూ కనిపించింది. అంతే.. ఆ కుటుంబమంతా హడలిపోయింది. గార మండలంలోని బూరవెల్లిలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. భారీ సర్పాన్ని చూసి కుటుంబ సభ్యులు కేకలు వేయగా.. స్థానికులు వచ్చి పామును కొట్టి చంపేశారు. సమీపంలోని వంశధార నుంచి వచ్చి ఉంటుందని అంటున్నారు. అలాగే వమరవల్లి పంచాయతీ హుకుంపేట వద్ద గెడ్డలో చేపల కోసం వేసిన వలలో శుక్రవారం ఉదయం చూసేసరికి కొండచిలువ ఉండటంతో దాన్ని కూడా చంపేశారు. – గార

మూగుపురంలో డీఎస్పీ విచారణ

సారవకోట: మండలంలోని మూగుపురం గ్రామంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ బి.రాజశేఖర్ విచారణ చేపట్టారు. ఈ గ్రామానికి చెందిన 9వ తరగతి బాలిక పై అదే గ్రామానికి చెందిన బుద్దల హేమసుందరరావు లైంగిక దాడికి పాల్పడినట్టు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన గ్రామంలో విచారణ చేపట్టారు.

ఆ వ్యాపారి ఏమయ్యారు..?

- మిస్టరీగా మారిన గ్రానైట్ వ్యాపారి మిస్సింగ్
- టెక్కలి సమీపంలో క్వారీని చూసేందుకు వచ్చి అదృశ్యమైన వైనం
- ఆరు నెలలుగా తెలియని ఆచూకీ



సుభోజీ (ఫైల్)

టెక్కలి: ఈ ఏడాది ఏప్రిల్ నెలలో టెక్కలి మండలం లింగాలవలస సమీపంలో గల ఓ గ్రానైట్ క్వారీని చూసేందుకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన గ్రానైట్ వ్యాపారి కాలే సుభోజీ అదృశ్యమై మళ్లీ కనిపించకపోవడం మిస్టరీగా మారింది. సుమారు ఆరు నెలలుగా అతని ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన గ్రానైట్ వ్యాపారి టెక్కలి మండలం లింగాలవలస సమీపంలో ఓ గ్రానైట్ క్వారీను చూసేందుకు వచ్చి ఆ తర్వాత అదృశ్యమయ్యారు. దీనిపై అతనితో వచ్చిన మరో వ్యక్తి టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో రోజు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. గ్రానైట్ వ్యాపారి ఆచూకీ విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసుల వద్ద కుటుంబ సభ్యులు మొరపెట్టుకోగా.. సుభోజీ ముంబై ప్రాంతంలో ఉన్నారనే విషయం ప్రాథమిక దర్యాప్తులో తెలుస్తోందని పోలీసులు చెబుతున్నారని, అయితే 6 నెలలుగా తమతో ఏనాడూ కనీసం ఫోన్‌లోనైనా మాట్లాడలేదని సోదరుడు రమణయ్య వాపోతున్నారు. సుభోజీ అదృశ్యమై కనిపించని సంఘటన ఒక వైపు గ్రానైట్ వర్గాల్లో సంచలనంగా మారింది.

అంతే కాకుండా ఆచూకీ విషయంలో పోలీసుల దర్యాప్తు నిర్లక్ష్యంగా ఉందంటూ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రానైట్ వ్యాపారి మిస్సింగ్ సంఘటన ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా మిస్టరీగా మారింది.

అనుమతే లేదు.. అయినా



భవన నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: నరసన్నపేటలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రభుత్వం మారిన తర్వాత అనుమతి లేని నిర్మాణాలు మరింతగా పెరుగుతున్నాయి. తాము ఎమ్మెల్యే తాలూకా అని కొందరు, కూటమి కార్యకర్తలమంటూ మరికొందరు ఇష్టానుసారం నిర్మాణాలకు పాల్పడుతున్నారు. తాజాగా మారుతీనగర్‌కు ఆనుకొని ఉన్న రాతికర్ర చెరువు విస్తీర్ణంలో సర్వే నంబర్ 187లో ఒక నిర్మాణం జరుగుతోంది. కంబకాయ రోడ్డు నుంచి స్క్రాప్ దుకాణం పక్క నుంచి మారుతీనగర్‌కు వెళ్లే దారిని ఆక్రమించి నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ ఇలాంటి ప్రయత్నాలను అధికారులు, మేజరు పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. కానీ ఇప్పుడు వారికి అడ్డు లేకుండాపోయింది.

ఇక్కడ పెద్ద భవంతి నిర్మాణం చేస్తుండగా పంచాయతీ నుంచి గానీ, సుడా నుంచి గానీ ఎలాంటి అనుమతులు లేవు. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం అప్పటి ఈఓ తులసీదాస్ పునాదులు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చారు. ఈ అనుమతులు చెల్లవు అని అప్పటి నుంచి నిర్మాణ పనులు అధికారులు అడ్డుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వం మారడంతో పచ్చబిళ్ల చూపి నిర్మాణ పనులు చేస్తున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చి ఇటీవల వరకూ ఈఓగా ఉన్న చిన్నారావు ఈ నిర్మాణ పనులను ఆపించారు. మా నిర్మాణ పనులు ఆపుతారా అని కొందరు యువకులు ఆయనపై ఒత్తిడి తెచ్చారు. ప్లాన్ అప్రూవల్‌కు పెట్టండి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన సూచించినా ప్లాన్ కోసం ఎలాంటి దరఖాస్తులు చేయలేదు. ఇప్పుడు నిర్మాణ పనులు మాత్రం చేసేస్తున్నారు. తప్పుడు సర్వే నంబర్లు వేసి రాతికర్ర చెరువులో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజుల చెరువు గట్టుపై కూడా పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా కొందరు షెడ్‌లు వేస్తున్నారు. మారుతీ నగర్‌లో నిర్మాణంపై పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా ఈ నిర్మాణ పనులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. తమకు దరఖాస్తు కూడా రాలేదని స్పష్టం చేశారు. అలాగే రాజుల చెరువు నిర్మాణాలపై మాట్లాడుతూ పన్ను చెల్లింపులో ఉన్న విస్తీర్ణం మేరకు రేకు షెడ్ వేస్తున్నట్లు తెలిపారు.

నేడు మన ఇళ్లు.. మన గౌరవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా శనివారం 'మన ఇళ్లు.. మన గౌరవం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. 'మన ఇళ్లు.. మన గౌరవం' కిందట ఇప్పటికే ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఒకవేళ పూర్తిచేయకపోతే అవి రద్దవుతాయని స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



పలాస సూదికొండ కాలనీలో ర్యాలీ

పలాస: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాసలో శుక్రవారం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ లాభాల బాటలో నడవాలంటే దానికి సొంత గనులు ఉండాలన్నారు. సొంత గనులు ఉంటే ముడిసరుకు టన్ను రూ.1500కే వస్తుందని, అప్పుడు ఆ పరిశ్రమ లాభాల బాటలో నడుస్తుందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటే ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉంటుందన్నారు. ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడినట్లు అవుతుందని చెప్పారు. ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా గాజువాక, గంట్యాడ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వేలాది మంది దినసరి కూలీలు, ఉక్కు పరిశ్రమ ఉద్యోగులు ఆ ప్రాంతంలో స్థిరపడి ఆర్థిక లావాదేవీలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ పరిశ్రమ కోసం సుమారు 32 మంది ప్రాణాలను త్యాగాలు చేశారని నాటి ఉద్యమ కాల పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, ఆదివాసీ సంఘం నాయకులు బంగ్లాకుమార్, సరస్వతి, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం



రహదారికి అడ్డంగా పడిన భారీ వృక్షం

టెక్కలి రూరల్: టెక్కలి నుంచి నౌపడ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీరంగం గ్రామం సమీపంలో శుక్రవారం భారీ వృక్షం నేలకూలింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి చెట్టు ఓ పక్కగా వాలిపోయింది. చివరకు శుక్రవారం రహదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

విభిన్న ప్రతిభావంతుల చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలో విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంప్‌లు నిర్మించాలని, దివ్యాంగుల చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్పీడబ్ల్యూడీ చట్టంపై అమలుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల వివరాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్, సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసి నాయుడుతో కలిసి సమీక్షించారు. సీనియర్ సిటిజన్ చట్టం అమలుపై అవగాహన పెంచాలన్నారు. వృద్ధాశ్రమాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద 4 శాతం బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఈ చట్టంపై ఇంకా ఎక్కువగా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. జిల్లాలో వృద్ధాశ్రమాలు ఏవీ రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. సమావేశంలో సీనియర్ సిటిజన్లకు ఒక భవనం మంజూరు చేయాలని, ఆర్టీసీలో, కోవెలల్లో ప్రత్యేకంగా క్యూ లైన్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఉండాలని కోరారు. దివ్యాంగుల కోసం పాఠశాల ఏర్పాటుకు విన్నవించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ దివ్యాంగులకు చేపట్టిన జాబ్ మేళాలో ఎంపికైన వారికి మంజూరు పత్రాలు అందజేశారు.

గార బంగారం కేసులో దర్యాప్తు వేగవంతం

శ్రీకాకుళం క్రైమ్ : గార ఎస్‌బీఐ బంగారం కేసులో దర్యాప్తు వేగవంతం చేసినట్లు డీఎస్పీ సిహెచ్ వివేకానంద పేర్కొన్నారు. కేసుతో లింక్ ఉండి తప్పించుకున్నారన్న అనుమానాలు ఉన్న కీలక బ్యాంకు ప్రతినిధులనే కాక ఈ ఉదంతం జరిగేటప్పుడు బ్యాంకులో పనిచేసే అందరినీ పిలిపించి విచారిస్తున్నట్లు చెప్పారు. కొందరి వద్ద స్టేట్‌మెంట్లు తీసుకుని పంపివేస్తున్నా ఆర్ఎంను మాత్రం పంపించకుండా విచారిస్తున్నారు. ఈ కేసును అప్పట్లో ఎస్పీ రాధిక సమక్షంలో ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ విజయ్‌కుమార్ ఛేదించి బంగారాన్ని రికవరీ చేసి కొంతమంది నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కేసు సమయంలో లీవ్‌లో ఉన్న టౌన్ డీఎస్పీ రాగానే దర్యాప్తు చేపట్టి కీలక క్యాషియర్‌ను అరెస్టు చేశారు. ఆమె బదిలీ కావడంతో ఈ కేసును మళ్లీ డీఎస్పీ వివేకానంద చేపట్టారు. ఈ కేసును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసు మరికొద్ది రోజుల్లో కొలిక్కి రానుందని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జెడ్పీ కార్యాలయ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పరిషత్ పీఎఫ్ సెక్షన్‌లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, ప్రధానకార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ సూపరింటెండెంట్‌ను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ పీఎఫ్ చందాదారులందరికీ స్లిప్స్ అందజేయాలని, ఏపీజీఎల్ఐ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని కోరారు. అలాగే డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్యను శుక్రవారం సాయంత్రం కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు పని సర్దుబాటుతో పాటు పలు సమస్యలను విన్నించారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో చోరీ



కొత్తపేటలో చోరీ జరిగిన కళావతి ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్ సమీపంలోని కొత్తపేట తారకరామాకాలనీలోని పక్కపక్కనే గల రెండిళ్లలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ దొంగతనంలో నాలుగు తులాల 75 గ్రాముల బంగారం, అరకిలో వెండి వస్తువులు పోయినట్లు బాధితులు చెబుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తారకరామా కాలనీలో నివాసముంటున్న దాట్ల కళావతి కుటుంబ సభ్యులు ఐదురోజుల కిందట ఇంటికి తాళం వేసి విశాఖ వెళ్లారు. అదేవీధిలో దుక్క తారకేశు కుటుంబం కూడా నివాసముంటోంది. ఇటీవల తారకేశు తండ్రి చనిపోవడంతో జ్యోతిష్యుని సూచన మేరకు ఎదురుగా ఉన్న మరో ఇంటికి మారారు. ఇదే అదనుగా భావించిన దొంగలు గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో దూరి దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దొంగలు ముసుగులు ధరించి మారణాయుధాలతో తిరుగుతున్నట్లు కనిపించింది. టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

ఒంటి నొప్పులు భరించలేక ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ కమ్మపేట గ్రామానికి చెందిన బాడాన గోవిందాచార్యులు (48) అనే దివ్యాంగుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గత కొంతకాలంగా అనారోగ్యం కారణంగా ఆయన ఒంటి నొప్పులతో బాధ పడుతున్నారు. జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంటి వద్ద ఉన్న కలుపు నియంత్రణ మందు తాగేశారు. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.